క్లుప్తంగా

మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక



బోధన్: మాల మహానాడు సాలూరా మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా బేగరి కృష్ణ, గౌతం బాలేరావు, ప్రధాన కార్యదర్శిగా షేరే భీమ్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా గౌతంప్రసాద్, గైని ప్రశాంత్, కోశాధికారిగా విఠల్, సలహాదారులుగా రాహుల్, లక్ష్మణ్, గంగాధర్ సోన్‌కాంబ్లే, బాలేరావు హన్మంతు, అరులే సునీ ల్, నీరడి ప్రకాశ్ ఎన్నికైనట్లు డివిజన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, మచ్కూరి దేవేందర్, అడ్వైజర్ సాలెన్ సంజీవ్ కుమార్, నాయకులు సరిడే సాయిలు, సింగాడే పాండు, గ్రామాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడిగా అశోక్



రుద్రూర్: కాంగ్రెస్ ఓబీసీ విభాగం మండల అధ్యక్షుడిగా కర్కె అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రాజరాజ నరేందర్ గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అశోక్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అశోక్ ప్రస్తుతం రుద్రూర్ సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

ఉత్తమ ప్రైవేట్‌టీచర్‌గా కమలాకర్



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన బోడగుడ్డు కమలాకర్‌కు ఆల్ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఆదివారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్‌నాయక్ చౌహాన్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శేషు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తాం

బాల్కొండ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని ఆ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్, నెహ్రూనగర్ కాలనీల్లో ఆదివారం 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ ధ్యేయమన్నారు. మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన శివాజీయూత్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, సునీల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పారు.

గ్రీన్ బడ్జెట్ పేరుతో అవినీతి

ఆర్మూర్‌టౌన్: మొక్కల పేరున 'గ్రీన్ బడ్జెట్' అని రూ.25లక్షల అవినీతికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆదివారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ సంబురాల్లో మిఠాయికి రూ.33వేలు ఖర్చయినట్లు చూపించారని, బోర్ల రిపేర్‌కు ప్రతి బడ్జెట్‌లో రూ.10లక్షల బిల్లులు చూపిస్తున్నారని విమర్శించారు. జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కలిగోట ప్రశాంత్, పాన్ శీను, పులియుగేంధర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పరిధిలోని ఆచన్‌పల్లిలో ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వాసు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనమైన పూజలు



మామిడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



మోర్తాడ్‌లో భజనమండలి సభ్యులకు సన్మానం



ఆలూర్‌లో బియ్యం బస్తాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- మండపాలవద్ద అన్నదానం
- ఆకట్టుకుంటున్న అలంకరణ

సాక్షి నెట్‌వర్క్ : గణేశ్‌నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు. ఆరు దశాబ్దాలుగా బోధన్‌పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న అంకుటవర్స్ వద్ద వినూత్న రీతిలో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది సైతం శ్రీ మహరాజ్ జ్యోతి గణేశ్ మండపంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు వినూత్న సందేశంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆలూర్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులకు 32 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎంపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మేడపాటి ప్రకాశ్‌రెడ్డి దంపతులు బోధన్ పట్టణంలోని గణేశ్ మంటపాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. గణేశ్ మంటపాల నిర్వాహకులు వారిని సన్మానించారు. తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెరుగు మహేశ్, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అంకాపూర్‌కు చెందిన అబ్రహం రాజు ఆరువందల డాలర్లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నాడని తెలిపారు. రెంజల్ మండలం నీలా, కళ్యాపూర్ గ్రామాల్లో గణేశ్‌నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



బోధన్‌లోని మహరాజ్ జ్యోతి గణేశ్ మండపంలో భక్తులు..



ఆర్మూర్‌లో అయ్యప్పరూపంలో..



అన్నదానం చేస్తున్న మేడపాటి ప్రకాశ్‌రెడ్డి దంపతులు



నీలాలో శోభాయాత్ర..



ఇండియన్ బాయ్స్ కోటార్మూర్..



బషీరాబాద్ ఫ్రెండ్స్ యూత్..

బకాయి వేతనాలు చెల్లించాలి



బోధన్: బకాయి వేతనాలను ప్రభుత్వం చెల్లించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. తమ బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలనే డిమాండ్లతో కార్మికులు ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 51వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. అక్రమంగా లేఆఫ్ ప్రకటనతో ఫ్యాక్టరీ మూసివేసి ఎనిమిదేళ్లు పూర్తి కావస్తోందని, కార్మికుల బకాయి వేతనాలు చెల్లించే విషయంలో అటు ప్రైవేట్, ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికులు రమేశ్, అన్వర్ దీక్షలో కూర్చున్నారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ పోటీలు

రెంజల్(బోధన్): జిల్లా సర్పంచుల ఫోరం తరఫున మండలంలోని సాటాపూర్‌లో యువతకు కబడ్డీ పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఎఖార్‌పాష తెలిపారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2500 నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న టీంలు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

లక్కీ స్కీం బాధితులకు న్యాయం చేయాలి

మోర్తాడ్: మండలంలోని దొన్కల్‌కు చెందిన లక్కీ స్కీం బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల నుంచి తాము హెచ్చరిస్తున్నా లక్కీ స్కీం బాధితులకు న్యాయం చేకూర్చడంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో ఆదివారం లక్కీ స్కీం బాధితులతో సునీల్‌రెడ్డి సమావేశమయ్యారు. న్యాయం జరిగే వరకు బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంత్రి అనుచరులు బరితెగించి ప్రజల నుంచి దోచుకోవడానికి లక్కీ స్కీంలను ఎరగా వాడుకున్నారని ఆరోపించారు. వారం, పది రోజుల్లో లక్కీ స్కీం బాధితులకు వారి డబ్బులు వాపసు చేయకపోతే మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.



బాధితులతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

సత్తాచాటిన క్రీడాకారిణులు

బోధన్‌టౌన్(బోధన్): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో నిర్వహించిన అండర్–17 జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో బోధన్‌కు చెందిన మహాత్మా జ్యోతిభా పూలే క్రీడాకారిణులు సత్తా చాటారు. ఆల్ ఇన్ వన్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. ఈ సందర్భంగా బహుమతులు అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.



క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్ జైపాల్

సమ్మెను తీవ్రతరం చేస్తాం



రుద్రూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నిరసన



బోధన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు



వేల్పూర్ తహసీల్ కార్యాలయం ఎదుట..

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో సమ్మెను తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. ఆదివారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 14వ రోజుకు చేరింది. వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వడం లేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల అంగన్‌వాడీలతో కలిసి వారి కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. బోధన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలతో కలిసి చిన్నారులు నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. టీఎన్జీవోస్‌లో ఉన్న ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ సెక్టార్ పరిధిలోని పది సెంటర్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌లో చేరారు. సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు.

సంక్షిప్తం

నలందలో మ్యాథ్స్ మహోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలోన్న నలంద హైస్కూల్‌లో ఆదివారం రామానుజన్ మ్యాథ్స్ మహోత్సవం పరీక్ష నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు కరస్పాండెంట్ లక్కారం ప్రసాద్ తెలిపారు. ఒలంపియాడ్ విద్యార్థులు పరీక్ష రాయడం ద్వారా ఉన్నత తరగతుల్లో గణితంలో రాణించే అవకాశం ఉంటుందన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

యువకులకు హెల్మెట్లు అందజేత

వేల్పూర్: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వితరణ చేసిన హెల్మెట్లను మండలంలోని కోమపల్లి, సాహెబ్‌పేట్ గ్రామాల యువకులకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించడంతోపాటు హెల్మెట్లు అందజేస్తున్న మంత్రికి యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు పత్రి రాజేశ్వర్, కైరి సుధాకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లల విడుదల



బాల్కొండ: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన చేపపిల్లలను ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ చెరువులో వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మత్స్యకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువకుల చేరిక



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్‌రెడ్డి హాజరుకాగా, సీనియర్ నాయకులు గంగాధర్‌గౌడ్, డేగ పోశెట్టి, కరిపె రాజేశ్వర్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. యువకులకు వారు కండువాలు కప్పి ఆహ్వానించారు. శివకృష్ణ, పీర్‌సింగ్, సత్యనారాయణ, భూమ య్య, కరుణాకర్, గంగాధర్, లడ్డు, నక్కల నవీన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి..

రెంజల్(బోధన్): మండలంలోని కిసాన్‌తండా చెందిన యువకులు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, యోగేశ్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు వైరల్‌జ్వరాల బారిన పడుతుండడంతో సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖవైద్యుడు, గ్రామానికి చెందిన డాక్టర్ భూమారెడ్డి, డాక్టర్ జలగం తిరుపతిరావు, డాక్టర్ నాగమోహన్‌తోపాటు వైద్య బృందం 146 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు పద్మ, రాజేశ్వర్, కోఆప్షన్ సభ్యులు సామ నవీన్, లక్మ నాగేశ్వర్, మమత, ఆశలు, కుందేటి శ్రీనివాస్, మండపల్లి మహేందర్, నోముల రమేశ్, గడ్డం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

తడపాకల్ విద్యార్థినికి అక్షరయాన్ పురస్కారం

మోర్తాడ్: బాల సాహిత్యంలో ప్రావీణ్యం సాధించిన ఏర్గట్ల మండలం తడపాకల్ విద్యార్థిని డేగల వైష్ణవికి 2022 సంవత్సరానికిగాను అక్షరయాన్ బాలికా పురస్కారాన్ని తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం అందించారు. హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ తంగేడు కిషన్‌రావు, ఎమ్మెల్సీ సురభివాణి వైష్ణవికి పురాస్కారం అందించారు. రచనలతో పాటు కవి సమ్మేళనంలో వైష్ణవి ప్రావీణ్యం సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందని తెలుగు పండిత్ ప్రవీణ్‌శర్మ పేర్కొన్నారు.



వైష్ణవికి పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

మరోసారి పసుపుబోర్డు పేరుతో మోసం

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నమ్మకం కోల్పోయిన బీజేపీ, రాజకీయ ఉనికి కోసం పసుపు బోర్డు పేరుతో రైతులను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం నాయకులతో సమావేశమై మాట్లాడారు. పసుపు బోర్డు అంశం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైతుల చిరకాల కోరిక అని అన్నారు. సెంటిమెంట్‌ను వాడుకొని గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన విధంగా మరోసారి మోసం చేసేందుకు ఎంపీ అరవింద్ సిద్ధమవుతున్నారని విమర్శించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం పుసుపునకు రూ. 12వేల మద్దతు ధర, పసుపుబోర్డు ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు మందుల పోశెట్టి, బట్టు శంకర్, మీసాల రవి, బాలకిషన్, పాషా, అఖిల్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోలా వెంకటేశ్

తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి

భీమ్‌గల్: తెలంగాణలో 60 ఏండ్లలో కాని అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేసి చూపించామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బాబాపూర్ హైవే నుంచి పురాణీపేట్ వరకు బైపాస్ రోడ్డు, బాబానగర్ కాలనీ నుంచి కుప్కల్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్, రూ.50లక్షలతో హనుమాన్ ఆలయ కల్యాణమండపం, హెల్త్ సంబ్‌సెంటర్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో నిర్వహించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వేముల

గ్రామాల్లో 'మేరీ మాటీ.. మేరా దేశ్'

పెర్కిట్(ఆర్మూర్)/రెంజల్(బోధన్)/మాక్లూర్/రుద్రూర్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌తోపాటు రెంజల్, మాక్లూర్ మండలం మామిడిపల్లి, పోతంగల్ మండలం హెగ్డోలీలో 'మేరీ మాటీ.. మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. గోవింద్‌పేట్ ఎంపీటీసీ యాల్ల రాజ్‌కుమార్, సొసైటీ వైస్‌చైర్మన్ తూర్పు రాజు, రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, మాక్లూర్ మండల బీజేపీ నాయకుడు గంగోనె సంతోష్, చిన్నాపూర్ వినోద్, గంగాధర్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు నాగం సాయిలు, బూత్ కన్వీనర్ మారుతిపటేల్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సురేశ్‌పటేల్, శివలింగ పటేల్, గంగారెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో మాట్లాడుతున్న సంతోష్

సీఎస్‌ఐ చర్చిలో వృద్ధుల సండే



సన్మానం పొందిన వృద్ధులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం వృద్ధుల సండే నిర్వహించారు. ముందుగా చర్చి ఫాదర్ ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వృద్ధులను ఘనంగా సన్మానించారు. ప్రతిఒక్కరూ పెద్దలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రేమయ్య, జ్యోతిరాజ్, సందీప్, దాస్, కిశోర్, బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – అష్ట దిగ్బంధనం - 1.00 ; ఖుషి - 3.55; సప్త సాగరాలు దాటి - 7.20; 7/జీ బృందావన కాలనీ - 10.25
- స్క్రీన్-2 – మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
- స్క్రీన్-3 – 7/జీ బృందావన కాలనీ - 01.10; మట్టి కథ - 4.40 ; బీటర్ - 10.00; మార్క్ ఆంథోని - 6.50
- స్క్రీన్-4 – జవాన్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45